# దొంగాటకం

**పి. సరళా దేవి**

పుచ్చ పువ్వులా వెన్నెలకాస్తోంది. డాబా మీద వెన్నెల్లో మంచంమీద పడుకుని కబుర్లు చెప్పుకుంటున్న అమ్మలు, బాబు లేచి, ఇంకో మంచంమీద పడుకున్న నాన్న దగ్గరికి వచ్చి మెల్లిగా చెరోపక్కలో సర్దుకున్నారు. వీళ్ళిద్దర్నీ చూచి "యింకా నిద్ర రాలేదా?" అన్నాడు నాన్న.

"ఒక కథ చెప్పు నాన్నా!" అమ్మలు అడిగింది.

"అవును నాన్నా! గోపీవాళ్ల వ్వ రోజూ మంచికథలు చెబుతుందట" బలపరచాడు బాబు.

"మరి మీకూ అవ్వుంటే మంచి మంచి కథలు చెప్పేది" అన్నాడు నాన్న.

"మాకు అవ్వలేదా నాన్నా?" అడిగింది అమ్మలు.

"లేదు దేముడిదగ్గరకువెళ్ళింది."

"మరిక్కడకు రాదూ?"

"రాదు మనమే అవ్వ దగ్గరకు వెళ్తాము."

"ఎప్పుడు వెళ్తాం నాన్నా?"

"మనంకూడా అవ్వలాగ మంచి మంచి కథలు ఎప్పుడు చెబుతామో అప్పుడే వెళ్తాం."

"అయితే....."

"అబ్బ! ఉండవే. నువ్వు కథ చెప్పు నాన్నా!" మళ్లా కథ జ్ఞాపకం చేశాడు బాబు.

"ఊఁ చెప్పునాన్నా!" తోసింది అమ్మలు తప్పింది కాదు నాన్నకి.

"అనగా అనగా ఒక రాజట. రాజుకి ఏడుగురు కొడుకులట..."

"అబ్బ! అదొద్దు నాన్నా!" విసుక్కున్నాడు బాబు

"మరింకేం చెప్పేదీ....."

"గోపీ వాళ్ళవ్వ చెప్పే కథల కన్నా మంచికథ చెప్పాలినాన్నా!" అమ్మలు దృఢంగా అనేసి దగ్గరగా జరిగింది.

"అనగా అనగా ఒక పట్నంలో ఒక అబ్బాయి ఉన్నాడు."

"నాన్నా! మరి మనూరు పట్నమేకదూ?" బాబు ప్రశ్న.

"ఆఁ పట్నమే. ఆ పట్నానికి ఎనిమిది మైళ్ళ దూరంలో ఒక పల్లె ఉంది."

"మైలుకి ఎనిమిది ఫర్లాంగులు కదునాన్నా! మా బడి వీధిగుమ్మం దగ్గరనించి పెరటిగోడవరకు వున్న పొడుగు ఒక ఫర్లాంగట - మా మాష్టారు చెప్పారు." తెలివితేటలొలకబోశాడు బాబు.

"ఆరుమైళ్ళకి ఎన్ని ఫర్లాంగులురా?"

"ఊఁ ఊఁ నువ్వెప్పుడూ ఇంతే-కథ చెప్పమంటే లెక్కలు చెబుతావు. ముందు కథ చెప్పునాన్నా!" అమ్మలు గునిసింది. బ్రతికిబోయాననుకున్నాడు బాబు. నాన్న కథ సాగించాడు.

"వినండిమరి. ఆ అబ్బాయి ఒక రోజు ఏదో పనిమీద పల్లెకు వెళ్ళవలసి వచ్చింది. దగ్గరేకదా అనుకుని ఉదయం సైకిలు మీద బయలుదేరాడు. ఆ మధ్యాహ్నం అక్కడ తెలిసిన వాళ్ళింట్లో భోజనం చేశాడు. పని తెమలడంలేదు. సాయంత్రం కావస్తోంది. వాళ్ళ పొలంలో పని చేస్తుండే నలుగురు రైతులువచ్చి "రేపటి సంతకి పట్నం పోతున్నాం బాబూ! మీరుకూడావచ్చేస్తారా?" అని అడిగారు. ఆ అబ్బాయికి పని తెమల్లేదు అందుచేత మీరు వెళ్ళండి తరువాత నేను వస్తాను" అని చెప్పి పంపించాడు. వాళ్ళు వెళ్ళిపోయారు. ఆ అబ్బాయికి పనంతా పూర్తయేసరికి చీకటి పడుతోంది. వెంటనే సైకిలుమీద బయలుదేరాడు. రెండుమైళ్ళువచ్చేసరికి చీకట్లు ఎక్కువగా వచ్చేశాయి. చుట్టూ తోటలు దట్టంగా వున్నాయి. ఆ తోటల్లో పడి రావాలి. ఆతోటల వలన చీకట్లు మరీ త్వరగా వస్తాయి. ఇంకొంచెం దూరం వచ్చేసరికి చీకటి బాగా వచ్చేసింది. ఆ అబ్బాయికి భయం వేసింది."

"అవును నాన్నా! ఒక్కళ్లూ చీకట్లో రావాలంటే భయం వెయ్యదూ...?" అంది అమ్మలు.

"అతనికి భయం. స్నేహితులు చెప్పిన దెయ్యాల విషయాలు జ్ఞాపకం వస్తున్నాయి, అతనికి వణుకుపుట్టింది. కటికచీకటి, కీచురాళ్ళధ్వనులూ, గాలికి కదలిన ఎండుటాకుల గలగలలూ...అతని భయం ఎక్కువై పోతోంది. చిన్న శబ్దానికి త్రుళ్ళిపడుతున్నాడు. భయ

ఎక్కువయిపోయి వణుకు జాస్తి అయిపోయి సైకిల్ తొక్కలేక పోయాడు. దిగి నడక మొదలెట్టాడు. క్రింద పాములూ అవీ వుంటాయని నడుస్తూంటే అసలే భయమేసింది. అలసిపోయి, సైకిల్ చేత్తో పట్టుకు నడుస్తూ అలాగే వస్తున్నాడు. ఇంతలో ఏటివంతెనవచ్చింది. మరింక నడవలేక సైకిల్ అక్కడపెట్టి, క్రింద కూర్చుని భయంతో కళ్లు మూసుకున్నాడు. ఆ ఏరు పారుతోన్న శబ్దంవినేసరికి మరింత భయమేసింది. ఒళ్ళంతా చెమటలు పోసింది. గొంతారి పోయింది. చచ్చిపోతానేమో అనుకున్నాడు. అతనికి భయం విపరీతమయిపోయి "అమ్మో" అని కేకవేసి గట్టిగా కళ్ళు మూసుకున్నాడు.

"పాపం ఎవరైనా అలావస్తే ఎంత బావుండును" బాబుసానుభూతి.

"ఏయ్! ఏమిటా కేకలూ?" అనే మాట వినేసరికి కళ్ళు తెరిచాడు. నల్లని ముసుగులు వేసుకుని నలుగురు మనుషులు కన్పించారు. అతను భయంతో వణికిపోయాడు. "నీ దగ్గర ఏమేమున్నాయో మర్యాదగా తీసి ఇక్కడపెట్టు" అన్నారు. ఇతనేమీ కదల్లేదు. వీళ్ళు నలుగురూ జేబులన్నీ వెతికి పర్సూ, రిస్టువాచీ, పార్కర్ పెన్నూ, ఉంగరం తీసుకుని వెళ్ళిపోయారు. ఆ అబ్బాయి బొమ్మలా అలా చూస్తూ వుండిపోయాడు."

"అవును. నలుగురు మనుషుల్తో ఒక్కడు పోట్లాడగలడా? అయినా ఆ దొంగలు నరకానికి పోతారులే నాన్నా!" నాన్న మీద జాలి చూపించేసింది అమ్మలు. నాన్నకు బలే నవ్వొచ్చింది.

"ఈ దొంగలు ఇలా వెళ్ళారో లేదో మళ్ళీ మనుషులు వస్తోన్న అలికిడయింది. అతను కదల్లేదు. చేతిలో లాంతరుతో వాళ్ళు దగ్గరకు వచ్చారు. ఇతనికంటే ముందు బయలుదేరిన రైతులే వాళ్ళు ఇతని అవస్థచూచి చన్నీటితో మొగం తుడిచి నోట్లో నీళ్లు పోశారు. అప్పుడు కొంత శక్తి, ధైర్యం వచ్చి లేచి అంతా చెప్పాడు వాళ్ళు చాలావిచారించి "మేము రామయ్యగారి బంగళాలో ఆగాం లేకపోతే ఈ సరికి పట్నం వెళ్ళిపోయే వాళ్ళమే" నన్నారు. అందరూ కలిసిమెల్లగా పట్నం వచ్చారు. అబ్బాయిని ఇంటి దగ్గర విడిచి వాళ్ళు వెళ్లిపోయారు. ఇంటికివచ్చి స్నానం చేసి, భోజనం చేసి జరిగిన సంగతంతా అమ్మా నాన్నకు చెప్పాడబ్బాయి. వాళ్లమ్మ ఇదంతా విని రాగాలు పెట్టుకుంటూ మిరపకాయలు, వుప్పు తెచ్చి దృష్టి తీసి పారేసింది."

"అంతేనా నాన్నా!"

"అబ్బే! అప్పుడేనా? ఇంకా వుంది. మర్నాడు అబ్బాయితో కలిసి వచ్చిన రైతులు వచ్చారు. "మాకు తగువొచ్చింది అది మీరు తీర్చాలి." అన్నాడొక రైతు.

"ఏమి టాతగువు?" అడిగాడబ్బాయి.

అప్పుడా రైతు చెప్పాడు: నేను సరదాకి రంగడిరూపాయి దాచాను. వాడు వెదుకుతూంటే ఏమీ ఎరగనట్టూరుకున్నాను వాడిని గాబరా పెట్టి ఏడిపించి యిచ్చాను. నేను రూపాయి ఇవ్వగానే వాడు 'దొంగతనంకూడా మొదలెట్టావన్నమాట' అని మండిపోయాడు. సరదాకి అలా చేశానని చెప్పినా వాడూరుకోలేదు. మీరే చెప్పండి నా తప్పేమైనా ఉందేమో?"

అప్పుడా అబ్బాయి నవ్వుతూ 'ఓస్! ఈమాత్రందానికే యింత గొడవా? సరదాకి దాచాడు ఇచ్చేశాడు. ఇందులో రూపాయి పోలేదు కనుక దొంగల్లేరు' అన్నాడు.

'తగువు విప్పినందుకు మీ ఋణం వుంచుకోములెండి' అంటూ ఒక మూట ఇచ్చారు రైతులు. అబ్బాయి విప్పిచూచే సరికి అందులో రాత్రి పోయిన పర్సు, రిస్టువాచి, పెన్ను, వుంగరం వున్నాయి."

"వీళ్ల దగ్గర కెల్లా వచ్చాయి నాన్నా!" అన్నారు అమ్మలూ, బాబూ ఒక్కసారిగా.

"వినండి. 'ఇవి మీ కెలా దొరికాయని' అడిగాడబ్బాయి ఆశ్చర్యంగా.

"దొరకడ మేమిటండి. రాత్రి వచ్చిన దొంగలం మేమే అయితే. సరదాకి మిమ్మల్ని తమాషా చేశాం మరేమీ అనుకోకండి." అన్నాడు ఒక రైతు.

"మీ వస్తువులు పోలేదు కనుక మేము దొంగలం కాము" అన్నాడింకొకడు. తగువు ఎందుకు విప్పిచారో బోధపడిందబ్బాయికి. ఇంక వాళ్ల నేమనడానికి తోచక రాత్రి ప్రవర్తన జ్ఞాపకంవచ్చి నవ్వేశాడు. రైతులు, అబ్బాయివాళ్ళ నాన్న

# "చూశారా, చుప్పనాతు లిద్దరి పని?"

"తాయిలమోయ్ తాయిలము
హాయిహాయి తాయిలము
ఎవ్వరికీ ఒక్క పిసరు
ఇవ్వనంటె ఇవ్వనుగా!"



"అక్కా యీ మూశా నా
ఒక్కముక్క పెట్టవటే!"

* * *

"ఎలాగైన మనమూ తా
యిలాన్నెగిరి కొడదమా?"



"చూశారా చూశారా
చుప్పనాతు లిద్దరి పని!
నంగనాచులల్లె వచ్చి
దొంగ దెబ్బ తీసినారు"

★

ముఖ్యఫోటో: పవల కృష్ణకుమార్,
మొదటిఫోటో, మూడవఫోటో:
—శ్రీపాద వెంకన్న.

★



---

అందరూ నవ్వేశారు." నాన్న పూర్తి చేసి పూపిరిపీల్చాడు.

"బలే. బలే. చాలా బావుంది నాన్నా!" అంటూ అమ్మలు చప్పట్లు కొట్టింది.

"ఆ రైతులు ఎంత తమాషా చేశారునాన్నా! ఇంతకీ ఆఅబ్బాయి పిరికివాడు కాబట్టి తెలుసుకోలేకపోయాడు" అన్నాడు బాబు.

ఇంతలో కిందంతా పనిముగించుకొని, తలుపులు వేసుకుని అమ్మ డాబామీదకువచ్చింది. ఇంకో మంచం మీద కూలబడుతూ

"బాబూ, అమ్మలూ ఆపిరికబ్బాయి ఎవరో తెలుసునా?" అంది. ఇద్దరూ వచ్చి అమ్మపక్కలో చేరారు.

"అదేమిటమ్మా! కథలో మనుషులు నిజంగా వుంటారేమిటి?" అన్నాడు బాబు కళ్ళుపెద్దవిచేసి.

"నిజంగావున్న మనుషులే కథలో వుంటారా!" అంది అమ్మ.

"మరిచెప్పమ్మా! ఆ పిరికబ్బాయి ఎవరమ్మా?" అంది అమ్మలు

"మీ నాన్నగారే నమ్మా!" అంది అమ్మ నాన్నవైపుచూచి నవ్వుతూ.

"బలే బలే. నాన్నేనా? నిజమేనా నాన్నా!" అంధి నాన్ననుచూచి.

"అమ్మవూరికేఅలా చెవుతోంది. నాన్న అలాంటి వాడు కాడు" నాన్నను వెనకేసుకొచ్చాడు బాబు.

"అలాంటి వాడుకాడేం? నాన్న పిరికబ్బాయి నువ్వూ పిరికివాడివే!" బాబుని వెక్కిరించిందమ్మలు.

'నువ్వే పిరికిదానివి. నేనేం

(54-వ పేజీ చూడండి)

# ★ ప్ర త్యు ప కా ర ం ★

[39 వ పేజి తరువాయి]

పెట్టాడు ఫ్రాన్సిస్కో.

ఎవరూ డబ్బుకోసం చావడానికి సాహసించలేకపోయారు. ఇద్దరు ముగ్గురు ప్రయత్నించారు కానీ, ప్రాణాలమీద వున్న తీపివల్ల పారిపోయివచ్చారు.

ఇంతలో ఎక్కణ్ణుంచో ఒకతను పరిగెత్తుకుంటూ వచ్చి, ఆ మంటల్లోకి దూరిపోయాడు. అంతా అతను చచ్చిపోయాడనుకున్నారు. కానీ, కొద్దినిమిషాల్లో ఆ మనిషి... పసివాడితో...నల్లగా మాడిపోయి బయటకు వచ్చాడు.

అంతా గోలగా అతనిమీద పడ్డారు, అతనెవరా అని. మసి పట్టిన అతనిని ఎవరూ పోల్చలేకపోయారు.

"రక్షించారు! ఇవిగో...యీ నాణాలు తీసుకోండి! రేపు నా ఆస్తినంతా మీ పేర రాస్తాను!" అన్నాడు ఫ్రాన్సిస్కో పసివాణ్ణి హృదయానికి హత్తుకొని.

"అక్కర్లేదు! మీ దగ్గర్నే వుండనియ్యండి!" అన్నాడు ఆమనిషి- ఆ గొంతు యిదివరలో ఎక్కడో విన్నాడు ఫ్రాన్సిస్కో. మనిషిని పరికించి చూశాడు. కొద్ది క్షణాల తర్వాత ఫ్రాన్సిస్కో అరిచాడు "హామెట్!" అని.

"మళ్ళీ ఎలా వచ్చావ్?" అని అడిగాడు హామెట్ని ఫ్రాన్సిస్కో.

"భగవంతుడి దయవల్ల!" అన్నాడు హామెట్.

"ఔను...అంతా దైవకృప. ఐనా, ఎలా వచ్చావో చెప్పు!"

"నేను ఓడమీద సురక్షితంగా రేవు చేరుకున్నాను అప్పుడే...... వెనిస్‌కు ఓడ బయలు దేరుతోంది. అందులో వెనిషియన్లు మా నాన్నని బానిసగా ఎక్కించుకొని తీసుకు పోతున్నారు. మా నాన్న చాలా ముసలాడు. వెంటనే నేను ఆ ఓడ యజమాని దగ్గరకు వెళ్ళి ఎన్నో విధాల బ్రతిమలాడేను. కానీ అతనికి దయ కలిగింది కాదు. చివరకు 'నన్ను తీసుకు వెళ్ళండి! నేనైతే యువకుణ్ని! చాకిరీ చేస్తాను. నన్ను అమ్ముకుంటే నాలుగురాళ్ళయినా వస్తాయి. ఆ ముసలాడు మీకేం పనిచేయగలడూ?...అతణ్ణి వదలండి నన్ను తీసుకుపొండి! అతణ్ని విడిచిపెట్టి నందుకుగాను ఈ డబ్బు తీసుకోండి!!' అని మీరు ఇచ్చిన డబ్బు యిచ్చేసి, నాన్నను పంపేసి...నేను ఇక్కడకొచ్చేసాను. ఇక్కడికి చేరి మూడురోజు లయింది. దగ్గర్లోనే బానిసగా ఉంటున్నాను" అన్నాడు హామెట్.

ఫ్రాన్సిస్కో కళ్ళ వెంబడి జలజలా నీళ్లు కారినయ్.

"దేవుడి దయవల్ల మీ ఋణం తీర్చుకున్నాను. అసలీ జన్మలో నే మీ ఋణం తీర్చుకోలేననుకున్నాను కాని, "హామెట్ కృతఘ్నుడు కాదు. కృతజ్ఞుడే!" అనిపించుకున్నాను. భగవంతుడు ఏదయినా మనమేలుకోసమే చేస్తాడు. ఇందుకే నన్ను రప్పించి వుండాలి!" అన్నాడు హామెట్.

"హామెట్! నీ ఋణం నే నెలా తీర్చుకోగలనూ?...నా ఆస్తినంతా నీ పేర రాస్తాను తీసుకో...!" అన్నాడు ఫ్రాన్సిస్కో.

"వద్దు...వద్దు! అది నీ దగ్గర్నే ఉండనీ" అన్నాడు హామెట్.

"ఐతే, ఈసారి నిన్ను విడిపించడమే గాదు. నీ దేశస్థు లందర్నీ కూడా విడిపించి, భద్రంగా టర్కీ పంపిస్తాను. అందుకే ఆస్తి అంతా ఖర్చుచేస్తాను" అన్నాడు ఫ్రాన్సిస్కో. హామెట్ ఆనంద బాష్పాలు రాల్చాడు. ★

## దొ ంగా ట కం

(37వ పేజీ తరువాయి)

పిరికి వాడ్ని కాను." ఉక్రోషంవచ్చేసింది బాబుకి.

"నేనేం కాను. నువ్వే"

"నువ్వే" ఇలా వాళ్ళిద్దరూ పోట్లాడుకోవడం చూచి అమ్మ నవ్వుకుంటూ అమ్మల్ని లాక్కెళ్లి బలవంతంగా ప్రక్కలో పండుకోబెట్టుకుంది. బాబుని నాన్న ప్రక్కలో వేసుకున్నాడు. వాళ్ళిద్దరూ గునుస్తూనే నిద్రపోయారు. ★

## స్త్రీలు-ఉన్నతవిద్యావశ్యకత

(48 వ పేజీ తరువాయి)

గుక్కెడు మంచినీళ్లయినా యివ్వని వారెందరో వున్నారు. ఒకపనిని ఒకచదువుకున్న స్త్రీ, చదువుకోని స్త్రీ చేస్తే, అందులోని లోపం, చదువుకున్నామె చదువుకీ, చదువుకోని ఆమె అజ్ఞానం (తెలియనితనం) కీ ముడిపెటటం మనకి అలవాటయిపోయింది. విద్యావిధానం ఎంత మార్పు చెందినా "పైఅంశాల్లో అనుభవం" అంటే Practical training యివ్వటం సాధ్యమయేది కాదు. ఇక విద్యావతులు కాని స్త్రీలు పై అంశాల్లో-అంటే పిల్లలపెంపకం, భర్తని ఆదరించి ఆనందింపచేయటం వివాహ పూర్వమే అనుభవం కలిగివుంటారేమో నేను గ్రహించలేకుండా వున్నాను. పెళ్ళిళ్ళయి ఇల్లు చక్కబెట్టుకోవటం చేతకాక చాలామంది పెళ్ళికే దూరంగా వున్నారంటే తప్పులేదేమో కాని, అతిశయోక్తి అనిపిస్తోంది. ★